ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
మంగళవారం 05 మే 2026

## ప్రజల మధ్యే పరిష్కారం

**చిన్నమండెం, మే 4, ప్రభాతవార్త:**



మండలంలోని బోడిరెడ్డిగారి పల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. గ్రామ ప్రజల సమస్యలతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను కూడా స్వయంగా వినిపించి, ఒక్కో అంశాన్ని శ్రద్ధగా పరిశీలిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు పరిష్కార సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తా మని తెలిపారు. ప్రజల విశ్వాసమే తనకు బలం అని, వారి అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

## శ్రీ అగస్త్యేశ్వర స్వామి మిరవణి

**ప్రొద్దుటూరు, మే4 ప్రభాతవార్త**

స్థానిక అగస్త్యేశ్వర ఆలయంలో సోమవారం సాయంత్రం దేవస్థానం వారిచే ఆలయ కార్య నిర్వహణాధికారి కే.వి.రమణ, ఆలయ ఛైర్మన్ వంగల నారాయణ రెడ్డి, పాలక మండలి స భ్యుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల మిరవణి ఆలయం లోపల నిర్వహించారు. భక్తాదులందరూ స్వామి వారి యొక్క సేవలో పాల్గొని స్వామి అమ్మవార్ల అనుగ్రహమును పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# ప్రేమజంట ఆత్మహత్య...

కడపలో యువకుడు.... చెన్నూరులో యువతి
మొదట యువకుడు ఆత్మహత్య..
భరించలేక యువతి ఆత్మహత్య..
ఇద్దరూ డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులే ...
కడప చిన్నచౌక్... చెన్నూరు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు

**కడప క్రైమ్, మే 04, ప్రభాతవార్త:**

వారిరువురు చెన్నూరు ప్రాంతానికి చెందిన వారే. ఇరువురు కులాలు వేరైనా ఒకే స్కూల్లో చదివారు. ప్రస్తుతం కడప బాలాజీ నగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. యువ జంట తరువాత గత కొన్నిసంవత్సరాలుగా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. అన్యోన్యంగా వుండి చదువకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నట్లుండి ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈనెల 3వ తేదీన తబంధువుల వివాహానికి వెళ్లి వచ్చారు. యువకుడు కడప నగరం మృత్యుంజయ కుంటలోని బాబాయ్ ఇంటికి వెళ్లి ఉన్నాడు. తరువాత ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకుని యువతి మనస్తాపానికి గురై చెన్నూరులోని తమ ఇంటికి వచ్చి సోమవారం ఉదయం ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతోఈ సంఘటన కడప నగరంతో పాటు, చెన్నూరు జిల్లాలో సంచలనం కలిగించింది. ఈసంఘటనపై కడప చిన్నచౌక్. చెన్నూరు పోలీసుల తెలిపిన వివరాలిలా వున్నాయి. కడప జిల్లా చెన్నూరులోని లక్ష్మీనగర్కు చెందిన గిరిరాజు కుమారుడు యోగేంద్ర కుమార వర్మ (20), గోదిన వీధికి చెందిన హేమశ్రీ(19) ఇరువురు పరస్పరం కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు ప్రస్తుతం కడప నగరంలోని బాలాజీ నగర్ పరిధిలో వున్న ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. యువకుడు కళాశాల సమయం ముగియగానే వాహనాలను నడుపుతూ డబ్బులను సంపాదించేవాడు. ఆ డబ్బును తన అవసరాలతో పాటు, తాను ప్రేమించిన యువతి హేమశ్రీకి చేదోడువాదోడుగా వుండేవాడు. ఈక్రమంలోనే వారిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఆదివారం ఇద్దరు కలిసి కడపలో జరిగిన ఓ వివాహానికి కూడా హాజరయ్యారు. తరువాత కడపలోని మృత్యంజయకుంట సమీపంలో యోగేంద్ర తన బాబాయ్ ఇంటికి వెళ్లాడు. హేమశ్రీ చెన్నూరులోని తన ఇంటికి వచ్చింది. సెల్ఫోన్లో ఒకరినొకరు మాట్లాడుకున్నారు. యోగేంద్ర కోపంతో సెల్ఫోన్తో తన తలకేసి కొట్టుకున్నాడు. తరువాత కొంతసేపటికి తన చిన్నమ్మ ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్కు ఉరేసుకుని ఆత్మహత్యకు. పాల్పడ్డాడు. ఈ సంఘటనపై చిన్నచౌక్ పోలీసులు మృతుని తండ్రి. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలియజేశారు. ఈ సంఘటనను తెలుసుకున్న యువతి హేమశ్రీ. యోగేంద్ర మృతదేహాన్ని చూసేందుకు వెళ్లింది. తరువాత తీవ్ర మనస్థాపానికి గురైంది. అక్కడినుండి తన ఇంటికి వెళ్ళినా యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కడప రిమ్స్ లోని మార్చురీకి తరలించారు. ఇరువురి బంధువుల ఫిర్యాదు మేరకు కడప చిన్నచౌక్. చెన్నూరు పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు.



## పార్ట్‌టైం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి వినతిపత్రం



ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులు

**పులివెందుల, మే 4 , ప్రభాతవార్త :**

పులివెందులలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి కి సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల పార్ట్‌టైం ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. అలాగే తమకు ఎదురవుతున్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్సీని అభ్యర్థించారు.వారి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురు రత్నం, అమరనాథ్ రెడ్డి, నాగేంద్ర, ఆదినారాయణ రెడ్డి, ప్రవీణ్ కుమార్, తిరుపాల్, ఉత్తయ్య, లక్ష్మి, గిరిజా కుమారి, కుర్షద్, సుబ్బారెడ్డి, బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే పభుత్వ ధ్యేయం

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

**రాజంపేట, మే 4 ప్రభాతవార్త**



పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే రాష్ట్రంలో కుటుంబం అధ్యాయమని ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించాలన్న అంకిత భావంతో పనిచేస్తున్నామని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు తీర్చేందుకే ప్రతి ఇంటికి వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నానని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రజల నుంచి వచ్చిన పార్టీ అని పేర్కొన్నారు. ప్రజల కోసమే పనిచేస్తున్నామని వివరించారు. సోమవారం ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా 8 మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిది, తొమ్మిది వార్డుల్లోని ముకుందార గడ్డ, బాలాజీ నగర్ లో జగన్మోహన్ రాజు పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఓ మహిళ ఏడుస్తూ తన సమస్యను జగన్ రాజుకు మొరపెట్టుకున్నారు. తప్పక సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటసుబ్బయ్య, మనుబోలు వెంకటేశ్వర్లు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీం,డాక్టర్ నవీన్ కుమార్, బూత్ కన్వీనర్లు అంజిబాబు ఆచారి, ఎద్దులపల్లి బాలాజీ నాయుడు, మన్నూరు పీర్ భాష ,జడ శివకుమార్, మహమ్మద్ అలీ, నాగ ముని ఆచారి, మన్నూరు సొసైటీ డైరెక్టర్ పరశురాం నాయుడు సిద్ధిక్, తదితరులు పాల్గొన్నారు.

కడప నగరంలో

## వాటర్ ట్యాంకుల తనిఖీ



**కడప కార్పొరేషన్ మే 4 ప్రభాతవార్త:**

కూచిపూడి రాకేష్ చంద్ర సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నగర పరిధిలోని ఇఎల్ఎస్ఆర్‌లను తనిఖీ చేశారు. అలంకాన్‌పల్లి వద్ద ఉన్న వాటర్ ట్యాంక్, సాటిలైట్ సిటీ ప్రాంతం, అలాగే మాసాపేట వాటర్ ట్యాంక్, మున్సిపల్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్ మరియు నెహ్రూ పార్క్ వద్ద ఉన్న ఎల్ఎస్ఆర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులకు నగర ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా నిరంతరం సక్రమంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, నీటి పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి విషయంలో ఎలాంటి నిరక్ష ్యల్లో ఉండకూడదని కమిషనర్ కూచిపూడి రాకేష్ చంద్రం స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పా ల్గొన్నారు.

కడప గడపలో చెరువులు, కుంటల

## అభివృద్ధికి 16.55 కోట్ల నిధులు



పరిపాలన ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
బద్వేల్ నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు
చెరువుల అభివృద్ధికి ఈ నిధులు ఎంతో దోహదం
జలవనరుల శాఖ ఇన్చార్జి చీఫ్ ఇంజనీర్ రవికిరణ్

**రాజంపేట, మే4 ప్రభాతవార్త**

వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి చెరువులు అభివృద్ధి చేసి, కుంటలకు మరమ్మతులు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టేలా, భూగర్భ జలాలు వృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీజన్కు రెండు నెలల ముందే చెరువులు, కుంటలు అభివృద్ధి చేసేందుకు ఉమ్మడి కడప జిల్లాకు నిధులు మంజూరు చేస్తూ 252 జీవో జారీ చేసింది. దాదాపు ముఖ్యమైన చెరువులన్నీ అభివృద్ధికి నాలుగున్నర నుంచి ఐదు లక్షల వరకు నిధులు మంజూరు చేశారు. జిల్లాలో అత్యధికంగా బద్వేలు నియోజకవర్గానికి నిధులు కేటాయించారు. రాజంపేట నియోజకవర్గంలో 19 చెరువులు, కుంటలు అభివృద్ధి చేసేందుకు 3.78 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో 216 జల వనరుల అభివృద్ధికి 16.55 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక చొరవతో సీజన్కు ముందే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. స్థానిక నీటి సంఘాల ద్వారా మరమ్మతుల పనులు చేపడతామని ఖివార్తఖికు తెలిపారు. నియోజకవర్గంలోని రాజంపేట మండలంలో హస్తవరం చెరువుకు 4.60 లక్షలు, మన్నూరు చెరువుకు 4. 50 లక్షలు, మందరం చెరువుకు 4. 50 లక్షలు, నందలూరు మండలంలో లేబాక చెరువుకు 4.50 లక్షలు, ఎర్ర చెరువు పల్లె చెరువుకు 4. 50 లక్షలు, ఒంటిమిట్ట మండలంలో ఒంటిమిట్ట చెరువుకు 5 లక్షలు, గంగల చెరువుకు 5 లక్షలు ,చింతరాజు పల్లి చెరువుకు 5 లక్షలు ,కూటాలమ్మ చెరువుకు 5 లక్షలు , కోనరాజుపల్లె తలసానికుంటకు 5 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. అలాగే సిద్ధవటం మండలంలో శాఖరాజు పల్లె పంచాయతీ మేకల చెరువుకు 5 లక్షలు, టకోలి ఎర్ర చెరువుకు 5 లక్షలు, మాచుపల్లిగుండ్ల కింద చెరువుకు 5 లక్షలు, వీరబల్లె మండలంలో గొల్లపల్లె గంగన కుంటకు 4.95 లక్షలు, సాని పాయ బోడెమ్మ కుంటకు 7.20 లక్షలు , పుత్త వాండ్ల పల్లె నాగుల చెరువుకు 4.70 లక్షలు,మట్లి తిమ్మారెడ్డి గుంటకు 3.87 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. ఆయా మండలాల ఇంజనీర్లు నివేదికలు సిద్ధం చేసి స్థానిక చెరువుల, కుంటలకింది నీటి వినియోగదారుల సంఘాల ద్వారా త్వరగా అభివృద్ధి పనులు చేపట్టాలని చీఫ్ ఇంజనీర్ ఆదేశించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**గాలివీడు..మే4. ప్రభాతవార్త.**



ప్రజాసంక్షేమం రాష్ట్ర అభివృద్ధి కూటమి పర్వతం లక్ష్యమని రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం తూముకుంట పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల వారిని దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధికి సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని కొనియాడారు. ప్రతినెల ఒకటో తేదీన వివిధ రకాల పింఛన్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ, విద్యార్థుల అభివృద్ధి కోసం తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు.అనంతరం ప్రజల దగ్గర నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరింప చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్లు భద్రపనాయుడు, పార్థసారధి రెడ్డి, మాజీ ఎంపిటిసి శేషారెడ్డి, వెంకట శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం తెలుగుదేశం పార్టీలోని ప్రతి కార్యకర్త సముచిత స్థానం కల్పిస్తున్నామని మంత్రి మండలి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నూలువీడు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం మంత్రి మండిపల్లి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని అందరూ కలిసిమెలిసి ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని తెలిపారు. గంప అమరనాథ, కంసాని వెంకటరమణారెడ్డి తో పాటు పలువురు టిడిపిలోకి చేరారు.

## డ్రైనేజీ కాలువను నిర్మించాలి



**దువ్వూరు, మే 4, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులో పోలీస్ స్టేషన్ వద్ద నుండి రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరును తొలగించేందుకు శాశ్వత ప్రతిపాదికతన డ్రైనేజ్ కాలువను నిర్మించాలని బిజెపి కార్యవర్గ సభ్యుడు ఆరవేటి హరి కృష్ణ తదితరులు సోమవారం తాసిల్దార్ సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో రోడ్డుపైన మురికినీరు వెళుతూ ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తుందన్నారు. ఈ విషయాన్ని ఎన్నో సార్లు అధికారులు దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజ్ కాలువ నిర్మించాలని ఆయన తన వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు బాల నాగిరెడ్డి ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించాలి



**రాజుపాళెం, మే 4, ప్రభాతవార్త:**

గ్రామాల్లో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు సచివాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శి తెలుసుకొంటూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జమ్మలమడుగు డి.ఎల్.డి.ఓ రామాంజనేయులు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో డి.ఎల్.డి.ఓ రామాంజనేయులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి సమస్యలను తెలుసుకొని త్రాగునీరు, పారిశుద్ధ్యము, వీధి దీపాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలిగించే దారులలో అడ్డంకులుగా ఉన్న రాళ్లు, దిబ్బలు, కట్టెలు, వ్యర్థ పదార్థాలను జెసిబిల సహాయంతో తొలగించాలని తెలిపారు. గ్రామాలలో మహిళా సంఘాలు నిర్వహించే గ్రామ సమాఖ్య సమావేశాలకు సచివాలయ అధికారులు వెళ్లి అక్కడ ఉన్న మహిళలతో మాట్లాడి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామంలోని వీధులలో తిరుగుతూ ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను గుర్తించాలని ఆయన కోరారు. ఎంపీడీవో సురేష్ బాబు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బందిని వారి ఆధీనంలో ఉంచుకొని సమస్యలు ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, ఎవరైనా సహకరించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షారుక్ అలీ ఖాన్, ప్రతాప్ లు పాల్గొన్నారు.

## కరువుపై కడప జిల్లా 'జల' విజయం

జలధారతో చిగురిస్తున్న ఆశలు.. జలహారతితో మురుస్తున్న రైతన్న



కడప జిల్లాలో సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జల ధారజలహారతి' ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలు పునరుజ్జీవం పోసుకుంటున్నాయి. రాయలసీమ గుండెకాయ కడప జిల్లాలో జలకళ ఉట్టిపడుతోంది. దశాబ్దాలుగా జిల్లాను వెన్నాడుతున్న కరువు రక్కసిని తరిమికొట్టేందుకు జిల్లా యంత్రాంగం సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి దిశానిర్దేశంలో 'జలధారజలహారతి' పథకం అద్భుతంగా రూపుదిద్దుకుంటోంది. సాగునీటి శాఖ అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

### అసాధ్యం సుసాధ్యం

ఒకప్పుడు నీటి కోసం ఎడతెగని నిరీక్షణ ఉన్న చోట, నేడు ప్రణాళికాబద్ధమైన పనులతో భూగర్భ జల నిధిని పెంచుతున్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తుండటంతో, సాగునీటి శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నారు. మైలురాయి:98 శాతం చెరువుల పునరుద్ధరణ ప్రణాళికలు పూర్తిజిల్లాలోని సాగునీటి వనరులకు ఊపిరి పోయడంలో జిల్లా యంత్రాంగం రికార్డు సృష్టించింది.

**లక్ష్యం:** 633 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు.

**సాధన:** ఇప్పటికే 621 చెరువుల పునరుద్ధరణ ప్రణాళికలు సిద్ధం చేసి, పనుల అమలుకు శ్రీకారం చుట్టారు. ఇది రాష్ట్రంలోనే అత్యుత్తమ పురోగతిలో ఒకటిగా నిలుస్తోంది.భూగర్భంలో 'జల నిధి': దాదాపు 77 వేల కొత్త నిర్మాణాలుకేవలం చెరువులనే కాకుండా, భూమి పొరల్లో నీటి నిల్వను పెంచడానికి భారీ ప్రణాళిక సిద్ధమైంది.

**భారీ లక్ష్యం:** జిల్లా వ్యాప్తంగా 76,983 నీటి సంరక్షణ నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు.గ్రామ విప్లవం: 828 గ్రామాల్లో చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు మరియు కందకాల ద్వారా వర్షపు నీటిని 'బ్యాంకు'లో దాచినట్లు భూమిలో భద్రపరుస్తున్నారు. ఉపాధికి ఆసరా రైతుకు భరోసాఈ జల ధార ప్రాజెక్టును మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయడం వల్ల రెట్టింపు ప్రయోజనం కలుగుతోంది. ఇప్పటికే 688 పనులు మంజూరై వేగంగా సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంత కూలీలకు చేతినిండా పని దొరుకుతుండగా, రైతులకు శాశ్వత సాగునీటి భరోసా లభిస్తోంది.

398 ఫీడర్ ఛానల్స్, 212 (ట్యాంక్ బెడ్ల)చెరువు పూడికతీత పను లతో చెరువుల నీటి నిల్వ సామర్థం రెట్టింపు అయ్యింది. 190 చెరువుల గట్లను బలోపేతం చేసి, భవిష్యత్ వరద లను తట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు.

### జిల్లాను జలసిరి గడప'గా మారుస్తాం.



జలధారజలహారతి ద్వారా పడే ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి పంపి, భవిష్యత్ తరాలకు జలనిధిని అందించడమే మా సంకల్పం. కడపను కరువు రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా మేము చేస్తున్న ఈ కృషికి ప్రజల సహకారం మరువలేనిది. ఇప్పటికే 76 పనులు ముమ్మరంగా సాగుతున్నాయి, మిగిలిన పనులను కూడా పూర్తి చేసి జిల్లాను 'జలసిరి గడప'గా మారుస్తాం.

## ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు బదిలీ

**దువ్వూరు, మే 4, ప్రభాతవార్త:**

స్థానిక పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్ళు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న లక్ష్మీ ్మపతి రెడ్డిని కడప స్పెషల్ బ్రాంచ్ కు, అలాగే సిద్ధయ్యను పొద్దుటూరు రెండో పోలీస్ స్టేషన్‌కు వీరి స్థానంలో ఒంటిమిట్ట నుండి దస్తగిరిని హెడ్ కాని స్టేబుల్‌గా నియమించారు. వీరిరువురు సోమవారం రిలీవ్ కాగా దస్తగిరి బాధ్యతలు చేపట్టారు.

# భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాల పునరుద్ధరణ

**బద్వేల్ అర్బన్, మే 4, ప్రభాతవార్త**

భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర కార్మిక సంక్షేమ మండలి ద్వారా నిలిచిపోయిన పలు సంక్షేమ పథకాలను తిరిగి అమల్లోకి తీసుకువచ్చిందని బద్వేల్ సహాయ కార్మిక అధికారి రూపేష్ కుమార్ రాజు పేర్కొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాల కింద నిర్మాణ కార్మికులకు వివాహ కానుకగా రూ.20 వేల రూపాయలు, ప్రసూతి సహాయంగా రూ.20 వేల రూపాయలు, సహజ మరణానికి రూ.60 వేల రూపాయలు, దహన సంస్కారాలకు రూ.20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించనున్నారు. 2009 నుంచి 2019 వరకు అమలులో ఉన్న ఈ పథకాలు 2020 నుంచి 2026 ఫిబ్రవరి వరకు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని పునరుద్ధరించడంతో కార్మికులకు ఊరట లభించిందన్నారు.

**పథకానికి అర్హత;**

ఈ పథకాలకు అర్హత పొందాలంటే కార్మికులు తప్పనిసరిగా కార్మిక శాఖలో నమోదు అయి గుర్తింపు కార్డు పొందాలి. వివాహ కానుక కోసం మహిళా కార్మికురాలు లేదా కార్మికుని ఇద్దరు కుమార్తెల వివాహాలకు మాత్రమే వర్తిస్తుంది. వివాహ సమయంలో గుర్తింపు కార్డు నవీకరణ (రిన్యూవల్) చేసి ఉండాలి. అదేవిధంగా ప్రసూతి సహాయం కోసం మార్చి 1, 2026 తర్వాత ఆస్పత్రిలో జరిగిన కాన్పులకు మాత్రమే వర్తిస్తుంది. సహజ మరణం పథకం కూడా మార్చి 1, 2026 తర్వాత మరణించిన నమోదు చేసిన కార్మికులకు వర్తిస్తుంది. సంబంధిత ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు వివరాలు సమర్పించాలి. అర్హులైన కార్మికులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా నమోదు కాని వారు వెంటనే నమోదు చేసుకొని, ఇప్పటికే ఉన్న వారు తమ గుర్తింపు కార్డులను సమయానికి నవీకరించుకోవాలని కోరారు.

## పకృతి వ్యవసాయం అవగాహన కార్యక్రమం



సిద్దవటం మే 4 ప్రభాతవార్త

మండలంలోని మాచుపల్లె రైతు సేవా కేంద్రంలో పకృతి వ్యవసాయ పద్దతులు మరియు ఎలినినో గురించి రెండు రోజుల పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది కి మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయి సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఎలినినో ప్రభావంనుతట్టుకునే విధానాలను, పియం డియస్, హాఫ్ మూన్ పద్ధతుల గురించి రైతులకు వివరించాలి అని మండల వ్యవసాయ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరు పకృతి వ్యవసాయం గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే రాబోయే రోజుల్లో రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేసేలా రైతులకు సూచనలు ఇవ్వాలి అని తెలిపారు. శిక్షణలో ఎలినినో గురించి, పియం డీఎస్,హాఫ్ మూన్ మోడల్, డ్రాట్ ప్రూఫింగ్ గురించి శిక్షణ లో అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులు వేసవిలో తేమ శాతాన్ని కాపాడుకోవడానికి పంట వ్యర్థాలతో భూమి మొత్తాన్ని కప్పిఉంచే విధానం అనగా మల్చింగ్ పద్ధతి గురించి శిక్షణలో అవగాహన కల్పించి నట్లు తెలిపారు. ప్రతి రైతుకు పకృతి వ్యవసాయ విధానాలను వివరించి ఎలినినో ప్రభావం పడకుండా తగు ముందస్తు జాగ్రత్తలు గురించి రైతులకు సిబ్బంది వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి వై. ప్రభాకర్ రెడ్డి, మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

## DHPS రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మునెయ్య ఎన్నిక

ఎడ్యుకేషన్ మే 5 ప్రభాతవార్త :



విజయవాడలో జరిగిన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర 3వ మహాసభలో నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కానగల మునెయ్యను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేల్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేశారు. విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చిన మునెయ్య, AISF, AIYF, CPI సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. గత ఐదేళ్లుగా DHPS జిల్లా కార్యదర్శిగా దళితుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు.తన ఎన్నికపై స్పందించిన మునెయ్య, రాష్ట్రవ్యాప్తంగా దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం DHPSను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.మీకు కావాలంటే ఇదిని ఇంకాస్త "హెడ్‌లైన్ స్టైల్" లేదా "ఎడిటోరియల్ స్టైల్"లో కూడా మార్చి ఇస్తాను.

## వైకాపాపై చమర్తి తీవ్ర విమర్శలు



నందలూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:

గ్రామాల్లో వైకాపా పార్టీ అరాచకాలను తిప్పికొడతామని తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు హెచ్చరించారు. ఆడపూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన, గత వైకాపా ప్రభుత్వంలో భూకబ్జాలు పెరిగాయని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజలు ఐక్యంగా ఉండాలని, వైకాపా నాయకుల కుట్ర రాజకీయాలకు లోనుకావద్దని పిలుపునిచ్చారు. భూకబ్జాలపై త్వరలో చర్యలు తీసుకుని, నిరుపేదలకు భూములు పంపిణీ చేస్తామని తెలిపారు. గ్రామస్తులు ప్రస్తావించిన త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రతాప్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, సింగిల్ విండో చైర్మన్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, పార్టీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దుల సాగర్, టిడిపి నాయకులు తాటి సుబ్బరాయుడు, మణికంత, ముమ్మడి శెట్టి రమేష్, పూర్ణ, సాయి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి



రాజుపాళెం, మే 4, ప్రభాతవార్త:

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ప్రతి కూలీకి పని చూపించాలని జమ్మలమడుగు ఇన్చార్జి ఏపిడి రామాంజనేయులు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులతో ఎంపీడీవో సురేష్ బాబు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరైన ఇన్చార్జి ఏపిడి మాట్లాడుతూ మండల టార్గెట్ గ్రామాల వారిగా టార్గెట్లు అడిగి తెలుసుకున్నారు. జలధార కార్యక్రమంలో ఎన్ని పనులు గుర్తించారని ఏ ఏ పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు దినసరి వేతనము ఎలా ఉన్నదని, ఏ ఏ పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలకు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ కరుణ, టెక్నికల్ అసిస్టెంట్లు శివప్రసాద్ రెడ్డి, మాధవి, నాగార్జున, వేణుగోపాల్ రెడ్డి, బిఎప్టి రాజకుమారి, సిఒలు, బండి హాసీనాలు పాల్గొన్నారు.

## పొలతల మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, మే 4, ప్రభాతవార్త:

మండలంలోని గంగనపల్లి పంచాయతీలో వెలసిన శ్రీ మల్లేశ్వర స్వామిని సోమవారం కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి దర్శించుకున్నారు. పూల మాలతో, శాలువాలతో ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల్లో పలు అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. అలాగే ఈవో కృష్ణానాయక్‌ను చైర్మన్ రాజారెడ్డిని పలుగు పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పొలతలను మరింత అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.





## మోటారు రిపేరు చేసి నీళ్లు సరఫరా

వేంపల్లి మే 04 ప్రభాతవార్త

స్థానిక చింతల మడుగు పల్లి దగ్గర కొత్తగా ఏర్పడిన కాలనీలో మోటర్ చెడిపోయిన కారణంగా నాలుగు రోజుల నుంచి నీరు రాలేదు వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుకట్ట రఘునాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ముండోడు గౌస్‌కు చెప్పడంతో స్పందించి రిపేరు చేయించి కాలనీ వాసులకు నీటి దాహార్తి తీర్చడం జరిగింది. దింతో కాలనీ వాసులు టీడీపీ మండల ఇంచార్జి రఘునాథరెడ్డి, టీడీపీ మైనారిటీ నాయకులు గౌస్ (ముండోడ్ )ను అభినందించారు.

ఏజెంట్ ద్వారా కువైట్ వెళ్లి మోసపోయిన మహిళ

## జగన్మోహన్ రాజు కృషితో క్షేమంగా స్వదేశానికి రాక



జగన్మోహన్ రాజుతో కలిసి మాట్లాడుతున్న బాధితురాలు లక్ష్మీదేవి

రాజంపేట, మే 4 ప్రభాతవార్త

మహిళలకు అండగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. ఏజెంట్ ద్వారా మోసపోయి గల్ఫ్‌లో చిక్కుకున్న పూలపత్తూరుకి చెందిన బాధితురాలు మంత్రి లోకేష్ చొరవతో సురక్షితంగా స్వదేశానికి రావడం వెనుక కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టం అవుతుందన్నారు. మన కార్యాలయంలో బాధితురాలుతో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు లక్ష్మీదేవి వెళ్ళింది. ఏజెంట్ మోసం కారణంగా పరదేశంలో అష్ట కష్టాలు పడింది. ఏజెంట్‌కు ఈ విషయం చెప్తే పట్టించుకోలేదు. దీంతో తన బాధలు తెలియజేస్తూ, ఏడుస్తూ తన సోదరుడు లక్ష్మీనరసయ్యకు సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసింది. లక్ష్మయ్య జగన్మోహన్ కలిసి తన సోదరి బాధలు వివరించారు. వీటిని జగన్మోహన్ రాజు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి లోకేష్ ఇండియన్ ఎంబసీకి సమస్యలు వివరించారు. దీంతో లక్ష్మీదేవి క్షేమంగా ఇంటికి చేరిందని జగన్మోహన్రాజు వెల్లడించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి ఆమె సోదరుడు లక్ష్మీ నరసయ్య ఇద్దరు రాజంపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చి జగన్మోహన్ రాజుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సందర్భంగా జగన్మోహన్ రాజు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాజంపేట ప్రాంతం అభివృద్ధిలో వెనకబడి ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని గల్ఫ్ ప్రాంతాలకు వలసలు పోతున్నారని,కూటమి ప్రభుత్వంలో ఈ వలసల నివారణకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని వివరించారు. అంతకుముందు బాధితురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు ,ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి లోకేష్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు ,ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా సరఫరా చేయాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్లపై చర్యలు తప్పవు... వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి హెచ్చరిక

పులివెందుల, మే 4 ,ప్రభాతవార్త :

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి డీలర్లకు సూచించారు. సోమవారం పులివెందుల మినీ సచివాలయంలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి కొరత రాకుండా సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించారు. రైతులకు విక్రయించే ఎరువులను తప్పనిసరిగా బయోమెట్రిక్ విధానంలో ఈపాస్ యంత్రాల ద్వారా మాత్రమే పంపిణీ చేయాలని సూచించారు. అలాగే సంబంధిత రిజిస్టర్లు, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని స్పష్టం చేశారు. పులివెందుల వ్యవసాయ డివిజన్ పరిధిలో ప్రస్తుతం సుమారు 500 మెట్రిక్ టన్నుల యూరియా, 600 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు నిల్వలో ఉన్నాయని తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో వాటిని అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిం చిన దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి, పులివెందుల మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణదారులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న వ్యవసాయ సంచాలకులు

## 3 రాష్ట్రాలలో బిజెపి విజయంతో సంబరాలు



ప్రొద్దుటూరు మే 4 ప్రభాతవార్త

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో ఎన్డీఏ మూడు రాష్ట్రాలలో అఖండ విజయం సాధించడంతో ప్రొద్దుటూరులోని బిజెపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. సోమవారం సాయంత్రం స్థానిక శివాలయం కూడలిలో బిజెపి శ్రేణులు చేరుకుని బాణాసంచా పేల్చుతూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కేవలం జాతీయవాదుల విజయం కాదని దేశం మొత్తం ఎదురుచూస్తున్న విజయమన్నారు. బిజెపిని అన్ని రాష్ట్రాల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు నరేంద్రరావు పాలెం కిరణ్ కుమార్ రూరల్ మండలాధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్ భూమి రెడ్డి భాస్కర్ రెడ్డి బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షులు దస్తగిరి బీహెచ్పీ జిల్లా అధ్యక్షులు నాగార్జున రావు మారెళ్ళ మల్లికార్జునరావు సివి విజయలక్ష్మి నల్లదిమ్మ కుమారి మరియు బిజెపి విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మూడు రాష్ట్రాల్లో విజయంతో బిజెపి సంబరాలు



రాజంపేట పాతబస్టాండ్ లో సంబరాలు చేసుకుంటున్న బిజెపి నేతలు

రాజంపేట, మే 4 ప్రభాతవార్త

ఐదు రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయ దుందుభి మ్రోగించిన నేపథ్యంలో సోమవారం స్థానిక పాత బస్టాండ్ నాలుగు రోడ్ల కూడలిలో బిజెపి నేతలు సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు పంచిపెట్టారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. నృత్యాలు చేశారు. మోడీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. పశ్చిమబెంగాల్లో విజయం చారిత్రాత్మకమన్నారు. అస్సాంలో బిజెపి పరిపాలనకు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. పాండిచ్చేరిలో ఎన్డీఏ కూటమికి ప్రజలు విజయాన్ని అందించారని సంతోషం వ్యక్తం చేశారు. రాజంపేట ఆర్ అండ్ బి బంగ్లా నుంచి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నాగోతు రమేష్ నాయుడు , సీనియర్ నాయకుడు పోతుగుంట నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ యాదవ్ , హిమగిరినాథ్ యాదవ్, నరేంద్ర రాజు, రాఘవవర్మ , పట్టణ అధ్యక్షులు వెంకటరమణ , తోట శ్రీనివాస ధీరజ్, గిరిధర్, మహిళా నాయకురాలు ప్రభావతి, తోట రామయ్య, అనేకమంది బిజెపి కార్యకర్తలు ఉత్సాహంతో పాల్గొని భారత్ మాతాకీ జై నినాదంతో హోరెత్తించారు.

## బోలా పద్మావతి సేవలు మరువలేనివి..

కడప కార్పొరేషన్ మే 4 ప్రభాతవార్త:



మాజీ కార్పొరేటర్, మాజీ కడప మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బోలా పద్మావతి కడప నగరవాసులకు ఎంతో సేవలందించారని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని బోల జయరాం, వైసిపి 22 వ డివిజన్ ఇంచార్జ్ ఈటె రామచంద్రయ్య, బోలా జయరాంలు గుర్తు చేశారు. సోమవారం బోలా పద్మావతి 5 వ వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని ఎర్రముక్కపల్లె లో ఉన్న నవజీవన్ సేవ ఆశ్రమంలో, ప్రకాష్ నగర్ లోని స్నేహాలయ నిరాశ్రయంలో, పాత కలెక్టరేట్, ప్రాంతాలలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతీ నగర్, రాజారెడ్డి వీధి, సీయోను పురం ప్రాంతాలలో ఆమె 3 సార్లు కౌన్సిలర్ గాను 3 సార్లు కార్పొరేటర్ గాను ఆమెకు ప్రజలు అవకాశం కల్పించారని అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఆమె మున్సిపల్ వైస్ చైర్మన్ గాను ఇంచార్జ్ చైర్మన్ గాను అవకాశం కల్పించిందని తెలిపారు. ఆమె రాజకీయ జీవితం మొదలు పెట్టిన తర్వాత ప్రజల నమ్మకాన్ని ఉమ్ము చేయకుండా ప్రతి కుటుంబానికి మేలు జరిగే విధంగా సేవలు సాగించారని తెలిపారు. రాజారెడ్డి వీధి, మారుతి నగర్, సీయోను పురం ప్రజల మేలును ఎప్పటికీ మా కుటుంబం గుర్తుపెట్టుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోలా వెంకట చక్రధర్, బోల తనూజ, ఈటె వెంకట జగన్నాథ్, ఈటె వెంకట దినేష్ కుమార్, ఈటె రామకృష్ణయ్య, మునిస్వామి, ఉత్తమ రెడ్డి, కృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బద్వేల్‌లో బిజెపి శ్రేణుల సంబరాలు

బద్వేల్ అర్బన్, మే 04 (ప్రభాతవార్త):

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన అద్భుత విజయం దేశవ్యాప్తంగా కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలిశెట్టి పవన్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సాధించిన గెలుపు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని అభివర్ణించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి జైత్రయాత్ర మొదలైందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. బద్వేల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకట సుబ్బయ్య రాయల్ మాట్లాడుతూ ఈ ఫలితాలు కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చాయన్నారు. జిల్లా బిజెపి సెక్రటరీ కొలిశెట్టి రమణయ్య, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు అన్నపురెడ్డి అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బెంగాల్ ప్రజలు తమ భవిష్యత్తు కోసం మోదీ, అమిత్ షాల నాయకత్వాన్ని బలపరిచారన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ మధుకర్ జి పర్యవేక్షణలో 70 నియోజకవర్గాల్లో బిజెపి విజయదుందుభి మోగించడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ రూరల్ అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు కుప్పల నరసింహులు, సుధాకర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రామకోటి రాజు, పాండు, సంజీవరెడ్డి, సురేష్ మరియు అధిక సంఖ్యలో భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూడు బిజెపి విజయకేతనం..

బ్రహ్మంగారిమఠం మే 04,ప్రభాతవార్త

మండల కేంద్రలోమూడు రాష్ట్రాలలో బిజెపి విజయదుంబి మోగించడం శుభపరిణామని మిఠాయి పంచి బిజెపి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి నాయకులు సంబరాలు జరుపుకొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అస్సాం, పశ్చిమ బెంగాల్, పాండిచ్చేరి మూడు రాష్ట్రాలలో మహిళా బిల్లును పార్లమెంటు సమావేశాలలో తిరస్కరించిన పార్టీలను మహిళలు తిరస్కరించారన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వాన్ని ఆ ప్రాంత ప్రజలు కూకటివేలతో పేకలించి వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రకాంతం ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి బుసెట్టిసుధాకర్ కటారు రమణ తదితరులు పాల్గొన్నారు.



## యాదాళ్ల వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ వితరణ





బద్వేల్ అర్బన్, మే 04 (ప్రభాతవార్త):

ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సామాజిక సేవే లక్ష్యంగా బద్వేల్ పట్టణంలో మజ్జిగ వితరణ కార్యక్రమం అనేక దపాలుగా నిర్వహించడం జరుగుతుంది, స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రం ప్రాంగణంలో సోమవారం, పలువురు పాదాచారులకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కీర్తిశేషులు యాదాళ్ల వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం, ఆమె భర్త యాదాళ్ల సుబ్రహ్మణ్యం మరియు కుమారుడు సురేంద్రల సహకారంతో సుమారు 500 మందికి పైగా బాటసారులకు, ప్రజలకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఎండ వేడితో అలమటిస్తున్న వారికి ఈ మజ్జిగ వితరణ ఎంతో ఊరటనిచ్చింది. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘ అధ్యక్షులు కే.వీ సుబ్బారావు మాట్లాడుతూ మండుతున్న వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం గొప్ప విషయమని కొనియాడారు. మాతృమూర్తి జ్ఞాపకార్థం ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం వారి కుటుంబ సభ్యుల సేవా దృక్పథానికి నిదర్శనమని, ఇది అందరికీ ఆదర్శనీయమని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కొలిశెట్టి వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, మేడ గురుబ్రహ్మం సతీమణి సుధారాణి, వల్లంకొండు అనిత్, జొన్నలగడ్డ సుధాకర్, యాదాళ్ల కుటుంబ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా బీజేపీ విజయాలపై పులివెందులలో సంబరాలు

పులివెందుల, మే 4, ప్రభాతవార్త :

దేశవ్యాప్తంగా ఇటీవల వెలువడిన ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, అస్సాం రాష్ట్రాల్లో సాధించిన విజయాలను పురస్కరించుకుని పులివెందుల పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ విజయాలు పార్టీ సిద్ధాంతాలపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పూలంగల్ సర్కిల్ వద్ద సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మరోసారి మద్దతు తెలిపారని అన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.ఈ విజయోత్సవం పార్టీ ఐక్యతను, కార్యకర్తల ఉత్సాహాన్ని, భవిష్యత్తులో మరింత ముందుకు సాగాలనే సంకల్పాన్ని ప్రతిబింబించిం దని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాను ప్రకాష్, పులివెందుల మండల అధ్యక్షులు వై. నవీన్, లక్ష్మయ్య, రమణారెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, కోడి మూర్తి శ్రీరాములు, తిరుపాల్, రెడ్డి ఉపేంద్ర, విష్ణు, కులాయప్ప తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కేరళంలో అధికారంలోకి రావడం హర్షనీయం



వేంపల్లె మే 04 ప్రభాతవార్త

కేరళం రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధికారంలోకి రావడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు కేరళం ఎన్నికల ఫలితాలపై సంతోషం వ్యక్తం చేస్తూ కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారని ఈ నేపథ్యంలో కేరళం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది అన్నారు అదేవిధంగా కేంద్రంలో కూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఇప్పటికే మూడు పర్యాయాలు మోడీ నాయకత్వంలో బిజెపి అధికారంలో ఉందని,వచ్చే ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటారని, బిజెపి ప్రభుత్వాన్ని మార్చి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తారని ఆశాభావం తులసిరెడ్డి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ధ్రువ కుమార్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, రాఘవయ్య, రామయ్య, షేక్ బాబావల్లి తదితరులు పాల్గొన్నారు.

## భాజపా విజయంపై బీజేపీ నేతల హర్షం



వేంపల్లె మే 04 ప్రభాతవార్త

మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో బిజెపి విజయం సాధించడంతో వేంపల్లిలోని భా.జా.పా నాయకులు సంబరాలు చేసుకున్నారు. వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తుండడంతో మూడు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, అస్సాం, ప్రజలు పట్టం కట్టడం హర్షనీయమన్నారు. భారతదేశాన్ని విశ్వ గురువుగా మోడీ చేస్తున్న కృషి అనితరమైంది. ఎన్డీఏ దేశ వ్యాప్తంగా చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే విజయానికి కారణమని ఆయన అన్నారు. మూడు సార్లు అధికారం లో ఉన్న మమతా బెనర్జీ ని అక్కడి ప్రజలు ఐకమత్యంతో ఉండి విజయాన్ని ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రా రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, జనసేన సీనియర్ నేతలు డాక్టర్ దాసరి రవిశంకర్, హరీష్,దశరథ, విజయ్ రవి తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్ పీఠంపై కాషాయ జెండా ఇదే బి జె పి అజెండా

సుండుపల్లె,మే 04,ప్రభాతవార్త :

మండల పరిధిలోని నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం సాయంత్రం మండలంలోని కూటమి నాయకులు దేశంలో జరిగిన ఎన్నికలలో ప్రభంజనం సృష్టించిన సందర్భంగా వేడుకలు జరుపుకొన్నామని బిజెపి మండల అధ్యక్షుడు రమణ గౌడ్ తెలియజేసాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అరాచక పాలనకు అంతం గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న హింస, అవినీతి మరియు తుష్టికరణ రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీని ఎంచుకున్నారన్నారు.రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, మద్దతు తెలిపిన మేధావులకు మరియు ముఖ్యంగా మహిళా ఓటర్లకు యువఓటర్లకు బీజేపీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతోంది బెంగాల్‌లో ఇక నుంచి అభివృద్ధి పర్వం మొదలవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్డీఏ శివరామ నాయుడు,రెడ్డి రాణి, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ రామ్ జగదీష్ స్వామి,సీనియర్ నాయకులు సుబ్బరాజు,వెంకటరామరాజు,ఆంజనేయులు, నాగరాజు, సుధాకర్ బిజెపి ప్రధాన కార్యదర్శి నాగ శంకర్ లు పాల్గొన్నారు.



## తండ్రి స్మృతిలో నివాళులు అర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



చిన్నమండెం, మే 4, ప్రభాతవార్త: మండలం,బోడి రెడ్డి పల్లెలో సోమవారం రాయచోటి నియోజకవర్గానికి 2 సార్లు శాసనసభ సభ్యులుగా గెలిచి సేవలందించి, ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేసిన మహానుభావుడు, పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మండిపల్లి నాగిరెడ్డి గారి 34వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నాగిరెడ్డి సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తన తండ్రి నాగిరెడ్డి గారు ప్రజల సేవలో అంకితభావంతో పనిచేసిన గొప్ప నాయకుడని ఆయన ఆశయాలు, ఆదర్శాలు తనకు మార్గదర్శకమని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం యన చూపిన మార్గంలోనే ముందుకు సాగుతాననిస్పష్టం చేశారు.

## బాహుదా కాలువ కబ్జాపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు



జాయింట్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె, మే 4 ప్రభాతవార్త : బాహుదా కాలువ కబ్జాపై బహుజన యువసేన నాయకులు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా బివైఎస్ అధ్యక్షులు పునిత్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని రెడ్డప్పనాయుడు కాలనీ ఆపార్ట్‌మెంట్ల వెనుక ప్రవహిస్తున్న బాహుదా కాలువ వంక ఆక్రమణలకు గురికావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రకృతి ప్రసాదించిన బాహుదా కాలువలను కొంతమంది స్వార్థపరులు కబ్జాచేయడంతో వర్షపునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వానికి చెందిన వంకను పూడ్చివేసి చదునుచేయడంతో వర్షాకాలంలో నీరు రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు కాలువల పూడికను తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ముందస్తు ఇంటి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందండి

### డిఎల్‌పిఓ నాగరాజు



తంబళ్లపల్లె మే 4 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె కు చెందిన ప్రజలు ముందస్తు ఇంటి పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి మండలంలో ఇంటి పన్ను వసూలు, బకాయిలు, గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2026 27 ఆర్థి చేయడానికి ఇంటి పన్ను ఈనెల 31వ తేదీ లోపు ముందస్తుగా చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని సూచించారు. ఇప్పటివరకు ముందస్తు పన్ను చెల్లింపు మదనపల్లె మండలంలో 37 వేలు, నిమ్మనపల్లి 13వేలు, చౌడేపల్లి 15వేలు, కురబల కోట 12వేలు, పుంగనూరు ఐదువేలు, పీటీఎం 3వేలు పెద్దమండెంలో వెయ్యి రూపాయలు మొత్తం రూ 86వేలు వసూలు అయినట్లు చెప్పారు. గత ఏడాది పన్ను వసూళ్ల డివిజన్ స్థాయిలో రూ5.92 కోట్లు డిమాండ్ ఉండగా రూ 5.49 కోట్లు వసూలు జరిగి రూ 43 లక్షలు బకాయిలు ఉన్నట్లు మొత్తం 92.73 పన్ను వసూల్ అయినట్లు చెప్పారు. పంచాయతీలు ఆదాయ వనరు పెంపుకు మైనర్ ఇరిగేషన్ చెరువులు చేపలు చెరువు వేలం, వారపు సంతలు, బస్టాండ్ గేట్లు, మినీ పరిశ్రమలు, ప్రైవేట్ వ్యాపార సముదాయాల లైసెన్స్ ఫీజులు వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ఎంవీ ప్రసాద్, కార్యదర్శిలు శ్రీనివాసరావు, హరి ప్రసాద్, పద్మావతి, భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగో సారి వారపు సంతల వేలం పాటలు వాయిదా



తంబళ్లపల్లె మే 4 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె, పరస తోపు పంచాయతీలకు చెందిన ఉమ్మడి వారపు సంతల వేలం పాటలు మరో మారు వాయిదా పడ్డాయి. తంబళ్లపల్లె నుండి పరసతోపు పంచాయతీ విడిపోవడంతో వారపు సంత రగడ మొదలైంది. గంగమ్మ గుడి వద్ద దశాబ్దాలుగా జరుగుతున్న వారపు సంత నిర్వహించాలని వేలంపాటదారులు, రెండు పంచాయతీల ప్రజలు కోరడంతో విధి లేని పరిస్థితుల్లో కార్యదర్శిలు శ్రీనివాసరావు, హరి ప్రసాద్ లు వారపు సంత వేలం పాటలు వాయిదా వేస్తున్నట్లు విలేకరులకు తెలిపారు. తంబళ్లపల్లె వారపు సంత, బస్టాండ్ గేటు వేలం పాటలు తరచూ వాయిదా పడటంపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో పంచాయతీకి రావాల్సిన ప్రధాన ఆదాయ వనరులు కోల్పోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కట్టుదిట్టమైన నియమ నిబంధనలతో వారపు సంత వేలం పాటలు నిర్వహించి రెండు పంచాయతీల ఆదాయ వనరుల పెంపుకు సహకరించాల్సి ఉంది.

## భూముల రీ సర్వేలో దళితులకు తీవ్ర అన్యాయం



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కేవీ పల్లె మే 4 ప్రభాతవార్త : కెవిపల్లి మండలంలో దళితులకు భూముల రి సర్వేలో అన్యాయం జరుగుతోందని ఎం డి పి ఎస్ ( మాదిగదాల పోరాట సమితి ) రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య అమృతపురి మల్లికార్జున ఆరోపించారు ఈరోజు కేపపల్లి మండలంలో తాసిల్దార్ నరేంద్ర కుమార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఎం డి పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ గారి ఆదేశాల మేరకు సోమవారం మండలంలో జరుగుతున్నటువంటి భూముల రీ సర్వేలో తీవ్ర అన్యాయం జరుగుతున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపల్లి శేఖరన్న దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు మేము వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తహసిల్దారు నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దళితుల సమస్యలపై అన్యాయం జరిగి ఉంటే నా దృష్టికి తీసుకొస్తే నేను కచ్చితంగా న్యాయం చేస్తానని తహసిల్దార్ అన్నారు. దళితుల భూములు పకడ్బందీగా అమలు చేయాలని రీసర్వే ఇబ్బందికి అభ్యర్థన మేరకు వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎండిపీఎస్ నాయకులు చిన్నప్ప హేమంత్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పఠాన్ ఖాదర్ ఖాన్



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

మదనపల్లి, మే 4 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్‌గా, రాజంపేట పార్లమెంటు టిడిపి ప్రధాన కార్యదర్శి, మదనపల్లి నియోజకవర్గ టిడిపి మైనార్టీ ముఖ్య నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం విజయవాడలోని ఉర్దూ ప్రభుత్వ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పఠాన్ ఖాదర్ ఖాన్ మీడియాతో మాట్లాడారు.నా రాజకీయ జీవితంలో ఒక కీలక ఘట్టం అని ఆయన వ్యక్తపరిచారు.నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్, కూటమి ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పదవి నాకు గౌరవం మాత్రమే కాదు,ఇది ప్రజల పట్ల, ముఖ్యంగా మైనారిటీలపట్ల నా బాధ్యతను మరింత పెంచిన ఒక పవిత్రమైన బాధ్యత.అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షుబ్లీ సారథ్యంలో మంత్రి వర్యులు ఫరుక్,ప్రభుత్వ వ్యవహారాల ప్రత్యేక సలహాదారులు యం ఏ షరీఫ్ సహకారంతో పేద ప్రజల కోసం పనిచేస్తాను. ప్రభుత్వం ద్వారా ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపట్టేలా కృషి చేస్తాను.మాటలకే పరిమితం చేయకుండా, కార్యాచరణ స్థాయిలో బలోపేతం చేయడం, మైనారిటీల హక్కులు, అవకాశాలు, అభివృద్ధి కోసం ధైర్యంగా ముందడుగు వేయడం నా లక్ష్యం అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోనే ఒక ఆదర్శ సంస్థగా నిలబెట్టే దిశగా కృషి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నానని వ్యక్తపరిచారు. ఈ శుభసందర్భంలో మాకు ఆశీస్సులు అందించిన అకాడమీ సభ్యులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు,నా వెంటే నిలిచిన ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలు మా దిశ.. నాయకత్వం మా శక్తి.. మైనారిటీల అభ్యున్నతి మా లక్ష్యం! ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూ అకాడమీని శక్తివంతమైన వేదికగా మార్చే దిశగా నిబద్ధతతో ముందుకు సాగుతానని పఠాన్ ఖాదర్ ఖాన్ తెలియజేశారు.

## దళిత ఆశాజ్యోతి విజయ్‌కి హృదయపూర్వక శుభాకాంక్షలు

### డీహెచ్‌పీఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు టిఎల్ వెంకటేష్



వెంకటేష్

పీలేరు మే 4 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బహుజన ఉద్యమ స్ఫూర్తి ప్రదాత మాన్యవర్ కాన్సీరాం గార్ల తర్వాత దళిత జాతి నుంచి అధికారంలోకి వచ్చిన నాయకుడిగా విజయ్ విజయం యావత్ దళిత, బహుజన సమాజానికి గర్వకారణం. అంబేద్కర్ కలలు కన్నది, కాన్సీరాం బాటలు వేసింది, విజయ్ సాకారం చేస్తున్నారు. ఆయన "దళిత ఆశాజ్యోతి"గా వెలుగొంది, అణగారిన వర్గాల ఆకాంక్షలను నెరవేర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. విజయ్ గారికి డీహెచ్‌పీఎస్ అన్నమయ్య జిల్లా కమిటీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

## షానల్ కుటుంబానికి అండ ఉంటాం



షానల్ కుటుంబంతో జనసేన నాయకులు

పీలేరు,వాల్మీకిపురం, మే 4 : మస్కట్ లో చిక్కుకు పోయిన వివాహిత షానల్ కుటుంబానికి తాము అండగా ఉంటామని జనసేనపార్టీ మండల అధ్యక్షుడు పొలిమేర రెడ్డెప్ప అన్నారు. సోమవారం వాల్మీకిపురంలోని షానల్ ఇంటికి వెళ్లి షానల్ అత్త, పిల్లలను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షానల్ ను ఇండియాకు రప్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చర్యలు చేపట్టారని, అంతవరకు షానల్ కుటుంబానికి అండగా ఉండాలని జనసేన నాయకులకు సూచించారని వారు చెప్పారు. షానల్ గురువారం ముంబాయికి ఫ్లైట్లో రానుందని, అక్కడి నుంచి శుక్రవారం విజయవాడకు చేరుకుంటుందన్నారు. ఈ క్రమంలో షానల్ కుటుంబసభ్యులను విజయవాడకు తీసుకెళ్లేందుకు పీలేరు జనసేనపార్టీ ఇన్చార్జి దినేష్ అన్ని చర్యలను చేపట్టారన్నారు. బాధితకుటుంబానికి తాము అండగా ఉంటామని వారు భరోసాకల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేపాని ప్రభాకర్,పవర్ మహేష్, మణికంఠ, జావిద్, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

## యూపిహెచ్‌సి తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ డా. లక్ష్మీ నరసయ్య



మదనపల్లి క్రైమ్ మే 4 ప్రభాతవార్త. పట్టణంలోని త్యాగరాజ్ స్ట్రీట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపిహెచ్‌సి)ను సోమవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. లక్ష్మి నరసయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ మరియు మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన డీఎంహెచ్ఓ ముందుగా రిజిస్టర్లను, ఔషధ నిల్వల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే, ల్యాబ్ విభాగాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ, పరికరాల పనితీరు, నాణ్యత ప్రమాణాలు, ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలను సమీక్షించారు. ఫార్మసీ విభాగంలో మందుల నిల్వ, పంపిణీ ప్రక్రియను పరిశీలించి, మందుల సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో డీఎంహెచ్ఓ నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్య సిబ్బంది ప్రవర్తన, వేచి ఉండే సమయం వంటి అంశాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించారు. అదే సమయంలో, తనిఖీలో గుర్తించిన చిన్నపాటి లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. రోగుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిపై సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

## మానవత్వం చాటుకున్న గురుకుల సిబ్బంది



పులివెందుల, మే 4, ప్రభాతవార్త : మానవత్వానికి నిదర్శనంగా ఇపట్ల గురుకుల పాఠశాల సిబ్బంది తమ సహోద్యోగి కుటుంబానికి అండగా నిలిచారు. ఇటీవల అకాల మరణం చెందిన ఇపట్ల గురు కుల పాఠశాల పార్ట్‌టైమ్ టీజీటీ (సైన్స్) ఉపాధ్యా యురాలు సుభాన్‌బీ కుటుంబానికి పాఠశాల సిబ్బంది స్వచ్ఛందంగా రూ.1.30 లక్షలు సేక రించి అందజేశారు. సోమవారం పులివెందులలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మె ల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. సుభాన్‌బీ మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని, ముఖ్యంగా ఆమె ఇద్దరు ఆడపిల్లల భవి ష్యత్తు ఆందోళనకరంగా మారిందని తోటి ఉపాధ్యాయులు తెలిపారు.

## 595 మార్కులతో రాష్ట్ర 2వ ర్యాంక్ సాధించిన వైష్ణవికి ఘన సన్మానం



విద్యార్థి వైష్ణవి సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు, మే 4 ప్రభాతవార్త: పీలేరు బలిజ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్.డి. వైష్ణవిని ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలైన జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ కోటపల్లి పాఠశాలలో చదువుకున్న వైష్ణవి 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం విశేషం. వైష్ణవి తండ్రి ఆర్.డి. మునిరాజా, తల్లి ఎస్. శైలజల ముద్దుబిడ్డ. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఈ అద్భుత ఫలితంతో పాఠశాలకు, తల్లిదండ్రులకు, పీలేరు ప్రాంతానికి, బలిజ సంఘానికి గర్వకారణంగా నిలిచిందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణంలోని రాయల్స్ మెడికల్స్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమ్రాజుల సత్యనారాయణ, ఏజే సుబ్రహ్మణ్యం, ఎం. భాను ప్రకాష్, ఎం. జగన్ మోహన్, రాయల్ సుబ్బయ్య, బి మధు తదితరులు వైష్ణవిని పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని సంఘం తరపున ఆర్థిక సాయం 10,000 అందించి ఆశీర్వదించారు.

## ఉలవల గంగమ్మకు విశేష పూజలు



పీలేరు, మే 4 ప్రభాతవార్త: మండలంలోని తలపులలో శ్రీ ఉలవల గంగమ్మ తిరుణాలలో భాగంగా రెండో రోజు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోతురోజు ఊరేగింపు, కల్లుబోణం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి. భక్తుల కాలక్షేపానికి ఆసాది కథ చెప్పారు. అలాగే కోలాటాలు, చెక్కభజనలు, చాందినీ బండ్లు ప్రదిక్షణలు నిర్వహించారు.

## కోసువారిపల్లి పంచాయతీ నిధుల దుర్వినియోగం పై విచారణ



తంబళ్లపల్లె మే 4 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండలం కోసువారి పల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగం అయినట్లు స్థానిక టిడిపి నేతలు ఆదిరెడ్డి, శివరాం, ఆనంద నాయుడులు గత వారం రోజుల క్రితం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు సోమవారం డిఎల్పిఓ నాగరాజు నిధుల దుర్విని యోగంపై విచారణకు హాజరయ్యారు. పంచాయతీలో చేయని పనులకు బిల్లులు చేసుకున్నారని ఇంకా పలు ఆరోపణలు టిడిపి నాయకులు డిఎల్పిఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఎల్పీ ఓ నాగరాజు సంబంధిత కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరారు. గతంలో పంచాయతీ నిధులు ఏఏ పనులకు చేసిన కేటాయింపులు, జరిగిన పనుల వివరాలు, విడుదల చేసిన నిధులు రికార్డులతో సహా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యదర్శి శ్రీనివాసరావు వివరణ ఇస్తూ చేసిన పనులకు రికార్డులు సక్రమంగా ఉన్నాయని రికార్డులు ఈనెల 11వ తేదీ అప్పజెప్తానని లిఖితపూర్వకంగా డిఎల్పిఓ కు అందజేశారు.

## పిజిఆర్‌ఎస్ అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



మదనపల్లె, మే 4 ప్రభాతవార్త : పిజిఆర్‌ఎస్ అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో ప్రజలు అర్జీల రూపంలో కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు పిజిఆర్‌ఎస్‌లో విన్నవించిన అర్జీలను ఆయాశాఖల అధికారుల ద్వారా గడువులోపల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలు పరిష్కారం అయ్యేల మానటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్‌ఎస్ కాల్స్ నందు పాజిటీవ్ పర్మార్మెన్స్ ప్రజలనుంచి సేకరించే అభిప్రాయాలను పురోగతి సాధించాలన్నారు. అన్నిశాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి పనితీరుపై దృష్టి పెట్టి రాష్ట్రంలోనే జిల్లాను మెరుగైన స్థానంల ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లాకళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడి సర్వేయర్ భరత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## వైకాపా నాయకులపై దాడులు హేయమైనచర్య

### జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, మే 4 ప్రభాతవార్త : వైఎస్‌ఆర్ సిపి కార్యకర్తలు, నాయకులు, మద్దతుదారులపై జరుగుతున్న దాడులు కూటమి ప్రభుత్వ దాష్టికానికి నిదర్శనమని జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్‌లు తెలిపారు. రాయచోటి మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ దశరథరామిరెడ్డిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా ఎస్‌పికి దీరజ్‌కునుబిల్లికి వైకాపా జిల్లా అధ్యక్షులు ఆకెపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యు చింతల రామచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడిని ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన దారణచర్యగా వారు అభివర్ణించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్‌ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాల్సిన ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షసాధింపులకు పాల్పడుతోందన్నారు. పరిపాలనకు బదులుగా రెడ్‌బుక్‌పాలన కొనసాగుతోందని విమర్శించారు. వైకాపా నాయకులపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ మనూజా, షమీంఅస్లాం, నాయకులు వివిఎస్.రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రేవతి, అనీల్, జావీద్, శరాదారెడ్డి, నూరుల్లా,చిప్పిలి మల్లికార్జునరెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నెమడుగు హైస్కూల్లో టెన్త్ విద్యార్థుల విజయోత్సవం

### హైస్కూల్ కమిటీ ఛైర్మన్ రెడ్డి శేఖర్



తంబళ్లపల్లె మే 4 ప్రభాతవార్త ః ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా కన్నెమడుగు టెన్త్ విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి విజయ దుందుభి మోగించారని హైస్కూల్ కమిటీ ఛైర్మన్ రెడ్డి శేఖర్ ప్రశంసల జల్లు కురిపించారు. హైస్కూల్లో 42 మంది విద్యార్థులకు గాను 36 మంది పాసై అందులో 13 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. టెన్త్ విద్యార్థులు చూపిన ప్రతిభకు నిదర్శనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ హై స్కూల్ హెడ్ మాస్టర్ మదన్మోహన్, ఉపాధ్యాయుల బృందం విద్యార్థుల విద్యా విధానంపై చూపిన చొరవ ఈ ఉత్తమ ఫలితాలకు నిదర్శనమని విద్యార్థులు సైతం అధ్యాపకులు, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో సత్ఫలితాలు సాధించడం కన్నె మడుగు పాఠశాలకు కీర్తి కిరీటంలా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ తో పాటు అధ్యాపకులను ఘనంగా సన్మానించి విద్యార్థులను ప్రశంసించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆశీర్వదించారు. కన్నెమడుగు టెన్త్ విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలపై ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, పాఠశాల ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ వినోద్ కుమార్ తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## చెట్టు కొంచెం - కాత ఘనం



కాయలతో నిండిన మిరపచెట్టు

చౌడేపల్లి, మే 4 ప్రభాతవార్త పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లుగా ఓ మిరప చెట్టు చూసేందుకు చిన్నదే అయినా చెట్టంతా కాత కాసి అందరినీ ఆకర్షిస్తోంది. ఎరగంగనపల్లి సమీపంలోని రైతు పెరట్లో మిరప చెట్టును నాటాడు. ఆ చెట్టు నిండా మిరప విగ్గాసింది. గత సంవత్సరం నుంచి చుట్టు పక్కల వారితోపాటు తమకు మిరప కొరత తీరుస్తోందని రైతుతెలిపాడు. చూసేందుకు చిన్నకాయలే అయినా తింటే కారం నాశానానికి ఎక్కుతుంది. రోడ్డు పక్కనే చెట్టు ఉండటంతో అందరి దృష్టిని తనవైపు తిప్పుకొంటోంది.

## జలధార జలహారతి పనులను పరిశీలించిన ఎంపిడివో లతీఫ్ ఖాన్



రామసముద్రం మే 4 ప్రభాతవార్త రామసముద్రం మండలంలోని పెద్ద కురప్పల్లె గ్రామ పంచాయతి లో ని తిరుమలరెడ్డిపల్లె గ్రామసమీపంలో ని గుంతలపేట చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన జలధార జలహారతి పనులను మండల ఎంపిడిఓ లతీఫ్ఖాన్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు .జలధార జలహారతి లో భాగంగా మండలంలో .పెద్దకురప్పల్లె గ్రామ సమీపంలోని గుంతలపేట చెరువు, జరుగుతున్న ఫిడర్ ఛానల్ పనుల ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ఇంజనీర్ అసిస్టెంట్ మక్ సూధన్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ ఉపాధి హామీ కూలీల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు చలువ పందిళ్ళు ఓ ఆర్ ఎస్ ఫ్యాకెట్స్ నిమ్మ జ్యూస్ లను వెంట తెచ్చుకోవాలని ఉపాధి కూలీలకు తెలియజేసారు, అనంతరం భూగర్భ జలాల ఏ స్థాయిలో ఉన్నాయి, ఏయే పంటలు పండిస్తున్నారు,వాటి ఆదాయ వ్యయాలను గూర్చి రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లతీఫ్ ఖాన్,ఫీల్డ్ అసిస్టెంట్ అలీషా రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## యువకుడి పై బీరు బాటళ్లతో దాడి



మదనపల్లి క్రైమ్ మే 4 ప్రభాతవార్త. గంజాయి మత్తులో ఓ యువకుడు పై బీరు బాటిళ్లతో దాడి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం.. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దమండ్యం మండలం, తురకపల్లి కు చెందిన మహబూబ్ బాషా కుమారుడు షాబాన్ మొహిద్దిన్(25)కు, అదే ఊరికి చెందిన బాబు బుడన్ కొడుకు సయ్యద్ ఖదీర్ గతంలో గొడవలు జరిగాయి. సోమవారం మొహిద్దిన్ ఇంటికి సమీపంలో సయ్యద్ ఖదీర్ గంజాయి సేవిస్తుండగా ఆ సమయంలో అక్కడికి వెళ్లిన మొహిద్దిన్ పై బీర్ బాటిల్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికుల సాయంతో కుటుంబీకులు బాధితుడిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేస్తున్నారు. పెద్దమద్యం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మే 4 ప్రభాతవార్త :**
పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభకు జిల్లా కలెక్టర్ అభినందించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతోనే విజయానికి కారణం అవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, నిరంతరం శ్రమతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయన్నారు. ఇంటర్‌మీడియట్‌లో ఆసక్తి లక్ష్యాలను అనగుణంగా సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఉత్తమ ఫలితాలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంత కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, కోఆర్డినేటర్ అనూరాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో అన్నదానం



అభినందిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మే 4 ప్రభాతవార్త :**
పట్టణ సమీపంలోని దేవతానగర్‌లో ఉన్న చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టూటౌన్ ఏఎస్ఐ రమణ మాతృమూర్తుల వర్ధంతి సందర్భంగా చిన్నారులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణి మాట్లాడుతూ విధాత లాంటి దాతలు ఏఎస్ఐ రమణ అని అన్నారు. సంస్థకు ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపి .ఆనందన్ డైరెక్టర్ సుబ్రమణ్యంలు ఏఎస్ఐ రమణ కుటుంబాన్ని శాలువతో సత్కరించి అభినందించారు.

## ఆలయానికి నూతన గొడుగులు వితరణ



అమ్మవారికి గొడుగును సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**పీలేరు,వాల్మీకిపురం, మే 4 ప్రభాతవార్త :**
పట్టణంలో కొలువైన శ్రీ శక్తిమాత అమ్మవారి ఆలయానికి పట్టణానికి చెందిన నీళ్ల భాస్కర్ జాతర సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆలయానికి నూతన గొడుగులను ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ నూతన గొడుగులకు పూజలు నిర్వహించి రాత్రి జరిగే సింహవాహన సేవలో ఉపయోగించనున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయప్రధాన అర్చకులు ఉత్తేజ్ స్వామి వారికి తీర్థప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో రాంనగర్ ప్రాంత ప్రజలు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా శక్తిమాత అమ్మవారికి జలాభిషేకం



నీళ్ల బిందులతో జలాభిషేకం చేస్తున్న మహిళలు

పీలేరు,వాల్మీకిపురం మే 4 ప్రభాతవార్త: పట్టణంలోని కడప రోడ్డులో వెలసిన శ్రీ శక్తిమాత అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం అమ్మవారికి వెయ్యి ఒకబిందెలతో జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచినే పెద్ద ఎత్తున మహిళలు స్నానాలు ఆచరించి బిందెలతో గంగాజలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకించారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. నేడు మంగళవారం అమ్మవారికి జాతర సందర్భంగా దీలుబోణాలు సమర్పించనున్నారు. రాత్రి 7గంటలకు సింహవానంపై అమ్మవారు అధిరోహించి వాల్మీకిక్షేత్రంలోని నాలుగమాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయప్రధాన అర్చకులు ఉత్తేజ్స్వామి, రాంనగర్ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా ఆర్థికాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఎగ్‌మార్ట్ బండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, మే 4 ప్రభాతవార్త :**
మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్దపీఠ వేస్తున్నదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో మహిళా సంఘాల సభ్యులకు ఎగ్‌మార్ట్ బండ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది నపుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి మహిళ బ్యాంకుల నుంచి వచ్చే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, మెప్మా మధుసూదన్‌రెడ్డి, ఆర్పీలు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి అధికారులతో ప్రజాసమస్యలపై సమీక్షించారు. ప్రతి అధికారి ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణ ట్రాఫిక్ సమస్య నివారణ కోసం జిల్లా ఎస్‌పి దీరజ్ కునుబిల్లిని ఎమ్మెల్యే కలసి చర్చిం చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొలుత ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

## ఘనంగా సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

### ఫైనల్ ఇయర్ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్ల పంపిణీ - విద్యార్థుల్లో ఉత్సాహం




సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి, ప్రశంసా పత్రాలు అందజస్తున్న కరస్పాండెంట్

**పీలేరు మే 4 ప్రభాతవార్త:**
పీలేరు పట్టణంలోని సి యన్ ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పలువురు ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాన్ని ప్రార్థన గీతంతో ప్రారంభించారు. విద్యార్థుల ప్రతిభకు సభలో హాజరైన అతిథులు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా ఫైనల్ ఇయర్ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తమ విద్యా ప్రయాణంలో కళాశాల అందించిన సహకారం మరువలేమని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, విద్య అనేది జీవితాన్ని మార్చే శక్తి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో కళాశాల ముందుకు సాగుతోంది. నేటి యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా నాయకత్వ లక్షణాలు, సేవాభావం మరియు సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలి. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నిజం చేసే దిశగా కృషి చేయాలి అని అన్నారు., ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ఆత్మవిశ్వాసం ఉన్నవారికే మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలబడాలంటే క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే తత్వం అవసరమని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. లావణ్య మాట్లాడుతూ,"డిగ్రీ అనేది కేవలం ఒక సర్టిఫికెట్ మాత్రమే కాదు, అది జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది. విద్యార్థులు విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని కూడా నిర్మించుకోవాలి. సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగడం ప్రతి విద్యార్థి బాధ్యత" అని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా కళాశాల విద్యార్థుల అభివృద్ధికి ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి అండగా సీఎం సహాయ నిధి




**పులివెందుల, మే 4 , ప్రభాతవార్త :**
పేద ప్రజలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేద కుటుంబాలకు ప్రాణదాతగా మారుతోందని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదు కోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.సోమవారం ఉదయం తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో 54 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.20,67,595 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్సీ భూ మిరెడ్డి రామగోపాల్ రెడ్డి అందజేశారు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొం దిన పేద కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అ త్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చికిత్స కోసం ఎవరూ ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోం దని చెప్పారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయ నిధి అందేలా ప్రజా ప్రతినిధులుగా నిరంత రం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.చెక్కులు అందు కున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం ఎంతో ధైర్యాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో పార్టీ నాయ కులు జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్, మల్లెల శ్రీను పాల్గొన్నారు.

## రాయచోటిలో పోలీసులు పట్టించుకోలేదు

### పిజీఆర్‌ఎస్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన రైతు



**మదనపల్లి క్రైమ్ మే 4 ప్రభాతవార్త.**
రాయచోటి, చిన్నమండెం పోలీసులు తన సమస్యను పట్టించుకోవడం లేదని చిన్నమండెంకు చెందిన బాధిత వృద్ధ రైతు సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మదనపల్లె జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి బాధితులు అర్జీలను తీసుకు వచ్చి ఎస్పీని కలిశారు. సోమల మండలం, నంచంపేటకు చెందిన అన్సర్ బాష తన సొంత నిధులతో ప్రజల కోసం షెడ్డు నిర్మిస్తుంటే స్థానికులు కూల్చివేశారని ఫిర్యాదు చేశారు. పుంగనూరు మండలం, ఎల్లార్ బైలుకు చెందిన సుబ్రహ్మణ్యం తల్లి పేరున ఉన్న పట్టా భూమిని విఆర్వోఓ శ్రీనివాసులు మరొకరికి చెందేలా చేశారని ఫిర్యాదు చేశాడు. మదనపల్లెకు చెందిన ఏపీఎస్ఈబి యూనియన్ 28 ఏళ్ళ క్రితం కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకున్న భూమిని రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి రామకృష్ణ రెడ్డి నకిలీ పత్రాలతో కబ్జా చేశాడని ఫిర్యాదు చేశారు. ఇవే కాకుండా సుమారు 110 మంది బాధితులు భూ రెవెన్యూ సమస్యలతో పాటు మహిళలు గృహహింస కుటుంబ సమస్యలు వేధింపులు తదితర సైబర్ మోసాల పై ఎస్పీకి ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీల పట్ల అత్యంత బాధ్యతగా వ్యవహరించి బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పోలీసు అధికారులు పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. చట్టపరిధిలో వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లా కేంద్రానికి రాలేని దూరప్రాంతాల ప్రజలు తమ ఫిర్యాదుల కోసం వ్యయప్రయాసలకోర్చి ఇక్కడికే రావాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు. బాధితులు తమ పరిధిలోని స్థానిక పోలీసు స్టేషన్లు, సర్కిల్ లేదా సబ్ డివిజన్ పోలీసు కార్యాలయాల్లో తమ అర్జీలను నిర్భయంగా సమర్పించవచ్చన్నారు. అక్కడ కూడా సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి పై కేసు నమోదు



**రాయచోటి టౌన్ మే4 ప్రభాత వార్త**
ఈ దినం కోర్టుకు హాజరు పరచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సి, వెంకట రమణ మూర్తి ఆరు రోజులు సాధారణ జైలు శిక్ష విధించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ప్రజలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన గండి సురేష్ అనే వ్యక్తికి గౌరవ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సి వెంకట రమణ మూర్తి ఆరు రోజులు సాధారణ జైలు శిక్ష విధించినట్లు అర్బన్ సీఐ వెంకటాచలపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు వెల్లడించిన వివరాల మేరకు రాయచోటి మండలం మాసాపేట రెడ్డి వారి పల్లికి చెందిన గండి సురేష్, తండ్రి రాచయ్య,వయసు 38 అనే వ్యక్తి రెండవ తేదీన సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి అక్కడ ఉన్నటువంటి ప్రజలు మహిళలపై అసభ్యకరమైన పదజాల ఉపయోగించడంతోపాటు , బట్టలు విప్పి నగ్నంగా పాటలు పాడుతూ అసభ్యకరంగా ప్రవర్తించన అర్బన్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశామన్నారు. అనంతరం ఈ దినం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సి వెంకట రమణమూర్తి గారి ఎదుట హాజరు పరచడం జరిగింది. సదరు వ్యక్తిపై ఆరు రోజులు సాధారణ జైలు శిక్ష విధించడం జరిగింది. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన ఇతరుల పట్ల సభ్యకరంగా ప్రవర్తించిన అటువంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా అర్బన్ సిఐ వెంకటాచలపతి హెచ్చరించారు....

## ప్రమాదంతో ప్రయాణం



**చౌడేపల్లి, మే 4 ప్రభాతవార్త**
నిద్ర చోటెరగదు అనడానికి ఇదొక నిదర్శనం. ఎక్కడ నుంచి వస్తున్నారో కానీ కూలీలు ఎండ తీవ్రత అధికంగా వున్నప్పటికీ లారీ లోడ్‌పై పడుకొని నిద్రిస్తున్నారు. మలుపులు న్న ప్రాంతాల్లో లారీ నుంచి కిందపడి ఇలాంటి వారెందరివో ప్రాణాలు గాల్లో కలసి పోయాయి. చౌడేపల్లి - తిరుపతి మార్గం మధ్యలో లారీలు, ఈచర్‌లపై ఈ విధమైన ప్రయాణాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాహనాల్లో నిద్రిస్తూ ప్రయాణించడం ప్రమాదమని వీరికి ఎవరు చెప్పాలో మరి.

## పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థినులు

### ఘనంగా జరిగిన అభినందన సభ




**మదనపల్లి క్రైమ్ మే 4 ప్రభాతవార్త.**
బాలికా విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు పదవ తరగతి పరీక్షల్లో ప్రదర్శించిన ప్రతిభ దేశం గర్వించేలా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డా. కె. సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) డా. నన్నా అనూరాధ లు కొనియాడారు. జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన కేజీబీవీ విద్యార్థినులు, ప్రిన్సిపాళ్లకు అభినందన సభ నిర్వహించారు. సమగ్ర శిక్షా ఏపీసీ డా. అనూరాధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కేజీబీవీ విద్యార్థినులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అద్భుతమైన ఫలితాలను సాధించారని, జిల్లాలో కేజీబీవీలు 90 ఉత్తీర్ణతతో ముందంజలో ఉన్నాయన్నారు. జిల్లాలో 21 మంది విద్యార్థినులు 550 మార్కులకు పైగా, 100 మందికి పైగా విద్యార్థినులు 500 మార్కులకు పైగా సాధించడం కేజీబీవీల్లో అమలవుతున్న విద్యా ప్రమాణాలకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పిస్తున్నందువల్లే ఈ పాఠశాలల్లో ప్రవేశాల కోసం తీవ్ర పోటీ నెలకొంటోందని వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఐశ్వర్య (కేజీబీవీ రాయచోటి) 583 మార్కులు, జాహ్నవి (కేజీబీవీ పెద్దమండ్యం) 579 మార్కులు, స్పందన (కేజీబీవీ రాయచోటి) 577 మార్కులు సాధించిన విద్యార్థినులకు, వారికి దిశానిర్దేశం చేసిన ప్రిన్సిపాళ్లకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో సుమతి, అసిస్టెంట్ జీసీడీవో యశోద, సీఎంఓ కరుణాకర్, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ డి.జి. రామ్మూర్తి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థినులు, వరతల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### ఎమ్మెల్యేకు కార్మికులు వినతి



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మే 4 ప్రభాతవార్త :**
పారిశుద్ధ్య డైలీ వేజెస్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటియుసి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, యూనియన్‌నాయకులు మస్తాన్, జిల్లా కార్యదర్శి దేవాలు మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటిలో పనిచేస్తున్న డైలీ వేజెస్ వర్కర్లు, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. నెలనెలా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. అదే విధంగా కార్మికులకు గతంలో ఇచ్చిన ఇంటిస్థలాలకు పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమల, ఇంద్రాణి, జానకి, రాధ తదితరులు పాల్గొన్నారు.

## దారి సమస్య కల్గిన స్థలం పరిశీలన



రికార్డులను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ పార్వతి

**కాగతి(చౌడేపల్లి), మే 4 ప్రభాతవార్త**
దారి సమస్య కల్గిన స్థలాన్ని తహశీల్దార్ భూపతి పార్వతి పరిశీలించారు. మండలంలోని కాగతి పంచాయతీలోని 80-1లో దారి సమస్య వుందని రైతు రవీంద్రరెడ్డి పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసాడు. దీంతో స్పందించిన తహశీల్దార్ భూపతి పార్వతి సోమవారం వివాదస్పద స్థలాన్ని పరిశీలించారు. స్థలానికి చెందిన రికార్డులు తనిఖీ చేసారు. ఇరువర్గాల రైతల రికార్డులు తనిఖీ చేసి దారి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఆర్ఐ భరత్, విఆర్వో కాంతమ్మ, సర్వేయర్లు మురళి, సురేంద్రరెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన సర్వేని వేగవంతం చేయండి



**పీలేరు , మే 4 ప్రభాతవార్త:**
మండలంలో జనగణన సర్వేని వేగవంతం చేయాలని తహశీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాయలంలో ఎనిమినేటర్లకు, సూపర్ వైజర్లకు జనగణన సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సర్వేలో తప్పుఒప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించారు. సర్వే సమయంలో సిబ్బంది విధిగా ఐడెంటిటీ కార్డు ధరించాలన్నారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలన్నారు. ఈ నెలాబరుకు సెన్సెన్ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్వో రెడ్డిప్పనాయుడు. ఆర్ప మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బందికి పీఆర్సి అమలు చేయాలి



**దువ్వూరు, మే 4, ప్రభాతవార్త:**
విద్యుత్ శాఖలో పనిచేయుచున్న ఉద్యోగస్తులు అందరికీ నూతన పిఆర్సినీ వెంటనే అమలు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్, జిల్లా అధ్యక్షుడు నాగ సుబ్బయ్యలు కోరారు. దువ్వూరు సబ్ స్టేషన్ లో వారు మాట్లాడుతూ నూతన పిఆర్సితో పాటు పెండింగ్లో ఉన్న టీఏ బిల్లులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 2026 పిఆర్సి అమలు చేస్తామని హామీ ఇచ్చామని ఇంతవరకు చేయలేదు అన్నారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని ఆ విధంగా తెలంగాణలో పర్మినెంట్ చేశారని ఇక్కడ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని వెంటనే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి భద్రత పరికరాలు అందజేయాలని, మెడికల్ పాలసీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శీలం సుబ్బరాయుడు, బండి రామ్మోహన్ లు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టలో మండల అధ్యక్షులు



**సుండుపల్లి, మే 04,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని యానాది కాలనీలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యానాది కాలనీ వాసుల ఆహ్వానం మేరకు టిడిపి మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు, చప్పిడి ధనుష్ నాయుడు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు శ్రీ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యానాది కాలనీ ప్రజలు మండల అధ్యక్షులు రమేష్ నాయుడు, ధనుష్ నాయుడులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యానాది కాలనీ ప్రజలు పాల్గొన్నారు.